‘దుర్గం’లో పెరిగిన ఓటర్లు

- అధికంగా రాయదుర్గంలో 5,056 ఓట్లు కొత్తగా నమోదు
- కీలకంగా మారనున్న మహిళా ఓట్లు



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో ఈ సారి ఓటర్ల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికలతో పోల్చుకుంటే సుమారు ఏడు వేలకు పైగా కొత్త ఓట్లు నమోదయ్యాయి. ఇటీవల ఎన్నికల అధికారులు 2023 స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించిన ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. గతంలో కంటే అధికంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రాయదుర్గంలో 5,056 కొత్త ఓటర్లు నమోదు

డివిజన్‌లో 2019 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారి కంటే ఈ సారి కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య పెరిగింది. కళ్యాణదుర్గంలో 2,19,685 ఓటర్లు ఉండగా కొత్తగా 2,549 ఓటర్లు, రాయదుర్గంలో 2,49,605 ఉండగా కొత్తగా 5,056 ఓటర్లు ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్నారు. ఉరవకొండలో గతంలో 2,15,940 ఓటర్లు ఉండగా ఈ సారి 459 ఓట్లను వివిధ కారణాలతో అధికారులు తొలగించారు. కాగా వచ్చే ఎన్నికల్లో సైతం మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నాయి. మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తంగా 1,796 మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లు అధికారిక సమాచారం.

ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కళ్యాణదుర్గం	1,11,589	1,10,641	04	2,22,234
రాయదుర్గం	1,27,279	1,27,356	26	2,54,661
ఉరవకొండ	1,07,342	1,08,113	26	2,15,481
మొత్తం	3,46,210	3,46,110	56	6,92,376

కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు



18 ఏళ్లు దాటిన యువతీ యువకులు కొత్త ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సీఈఓ.ఆంధ్ర వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. లేదంటే సమీపంలోని గ్రామ సచివాలయం, బీఎల్వోల వద్ద వయస్సుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలు, ఆధార్ కార్డులను తీసుకెళ్లి ఓటరు నమోదు కోసం దరఖాస్తులు అందజేయాలి. – నిశాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ఘనంగా ఇమాంషావలీ షంషీర్ ఊరేగింపు



ఇమాంషావలీ సమాధిని వస్త్రాలు, పూలచదర్‌తో అలంకరించిన దృశ్యం



షంషీర్‌ను ఊరేగించి దర్గాకు తీసుకొస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో ప్రాఖ్యాతి గాంచిన హజరత్ ఇమాంషావలి ఉరుసుకు భక్తులు పోటెత్తారు. సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు ఉరుసు ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతం కిక్కిరిసిపోయింది. దర్గాలో భక్తులు చక్కెర ఫాతెహాలు, చక్కెర తులాభారం చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకూ మైసూరు నుంచి వచ్చిన సమ్రీన్‌తాజ్, కడప నగరం నుంచి వచ్చిన నవాజ్ ఛిస్తీ మధ్య పోటాపోటీగా సాగిన ఖవ్వాలీ భక్తులను ఆకట్టుకుంది. సోమవారం వేకువజామున హజరత్ ఇమాంషావలీ ప్రతిరూపమైన షంషీర్‌ను డ్రమ్ములు, మేళాతాళాయి నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు షంషీర్‌ను దర్శించుకుని పునీతులయ్యారు. సోమవారం ఉదయం జియారత్‌తో ఉరుసు వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా దర్గాలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ ధర్మకర్త ఫకృద్దీన్, ఉపాధ్యక్షుడు యూనుస్‌బాషా, కమిటీ సభ్యులు మైక్‌సెట్ ఆదం, మాబుపీరా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులూ.. ఆత్మస్థైర్యం కోల్పోవద్దు



జీవనరేఖను ఆశ్రయించిన బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, డీఆర్‌డీఏ ఏపీడీ, ఏడీఏలు

ఉరవకొండ: ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు చేతికందక ఆర్థిక ఇబ్బందులతో రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆర్డీఓ రవీంద్ర, డీఆర్‌డీఏ ఏపీడీ ఈశ్వరయ్య, ఉరవకొండ ఏడీఏ పద్మజ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు రెడ్స్ సంస్థతో కలసి జీవనరేఖ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ అధ్యక్షతన అధికారుల బృందం కౌన్సెలింగ్ ఇచ్చింది. ఆత్మహత్యకు సిద్ధపడి జీవనరేఖ సొసైటీకి ఫిర్యాదు చేసిన ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన గిరెప్ప, వెంకటేష్, గంగమ్మ సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ జీవనరేఖ కార్యక్రమం బాధితులకు భరోసా కల్పిస్తోందన్నారు. సొసైటీని ఆశ్రయించిన గిర్రప్పకు చేనేత మగ్గం ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకు రుణం మంజురు చేయడం, గంగమ్మకు ఎస్‌హెచ్‌జీ ద్వారా కిరాణాషాపు ఏర్పాటుకు రుణం, వెంకటేష్‌కు గొర్రెల పెంపకం కోసం రుణం మంజురు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ అమృతరాజు, ఏఓ శశికళ, ఐకేపీ ఏసీ శివయ్య, ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, అశోక్‌లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

వజ్రకరూరు: భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర అన్నారు. మంగళవారం ఆయన వజ్రకరూరు పరిసర ప్రాంతంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా త్వరలో చేపట్టనున్న రీ సర్వే ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించి రైతులకు మంచి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. రీ సర్వే ద్వారా దీర్ఘకాలంగా ఉన్న భూ తగాదాలు, సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. త్వరలో మండలంలో ప్రారంభం కానున్న రీ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల సర్వేయర్ ప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ కేశవరెడ్డి, వీఆర్వో సుబ్బారావు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు



గొడిశెలపల్లిలో ఇళ్ల పట్టాలు అందిస్తున్న దృశ్యం

డి హీరేహాళ్(రాయదుర్గం): అర్హులందరికీ జగనన్న గృహ సంకల్పం ద్వారా పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ రాళ్ల రామలక్ష్మమ్మ అన్నారు. డి హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లిలో మంగళవారం అర్హులకు ఇంటి పట్టాలను వైస్ ఎంపీపీ అనిత, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ బోయ నారాయణ, నాయకులు రాళ్ల తిమ్మారెడ్డి, రాయకృష్ణారెడ్డితో కలసి ఆమె పంపిణీ చేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మీటర్ కాలుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ఆకతాయుల ఆటలతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం పట్టణంలోని స్థానిక వడ్డే కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో అట్ట ముక్కలకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ మీటర్ పూర్తిగా కాలిపోయింది. అటుగా వాకింగ్ వెళ్తున్న వారు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మీటర్ కాలినట్లు గుర్తించారు. అనంతరం మరమ్మతు చేపట్టారు.

రేపటి నుంచి పంచమ జ్యోతుల మహోత్సవం



అలంకరణలో చౌడేశ్వరి దేవి

రాయదుర్గం: పట్టణంలోని నేసేపేటలో చౌడేశ్వరిదేవి పంచమ జ్యోతుల మహోత్సవాలు గురువారం వేకువజాము ఐదు గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శిరుమాళ్ల కృష్ణమూర్తి, కోశాధికారి మద్దిలేటి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి ఒడి బియ్యం, విశేష అలంకరణ చేపట్టాక సాయంత్రం గంగపూజకు తీసుకెళ్తామన్నారు. 13న పంచమ జ్యోతుల మహోత్సవం, ఊరేగింపు. మధ్యాహ్నం ఆలయంలో ప్రతిష్టాపన చేస్తామన్నారు. 14న వివిధ పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొల్లపురమ్మదేవికి పూజలు



పూజలందుకుంటున్న కొల్లాపురమ్మదేవి

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గ్రామదేవత కొల్లాపురమ్మదేవికి మంగళవారం జాతర సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, వడిబియ్యం , బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

రాయదుర్గం రూరల్: మండలంలోని జుంజురాంపల్లి పంచాయితీ పరిధిలోని మలకాపురం గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్య సేవలందించండి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ కరణం పుష్పావతి

విడపనకల్లు: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆస్పత్రి ఆరోగ్య కేంద్ర సలహా మండలి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ కరణం పుష్పావతి సూచించారు. మండలంలోని పెద్ద కొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి సలహా మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆస్పత్రిలోని సమస్యలపై వైద్య సిబ్బందితో చర్చించారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆమె సూచించారు. అనంతరం కమిటీతో కలసి ఆస్పత్రి పరిసరాలను ఎంపీపీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు మోదుపల్లి రామాంజినేయులు, వైఎస్ ఎంపీపీ మోదుపల్లి సునీతరాణి, మెడికల్ ఆఫీసర్ హరినాథ్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌బాబు, వార్డు మెంబర్ మోదుపల్లి మురళీమోహన్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాజీ

కళ్యాణదుర్గం రూరల్: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాజీ సూచించారు. మండలంలోని బోరంపల్లిలో మంగళవారం పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలకు ఉపాధి కల్పించడం కోసమే ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తోందన్నారు. కూలీలందరూ పనులకు వెళ్లి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చి ఉపాధి పొందాలన్నారు. ఈసీ రామచంద్రారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఇందిర పాల్గొన్నారు.

15న ముగ్గులు, వ్యాసరచన పోటీలు

రాయదుర్గంటౌన్: అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15న విద్యార్థినులు, మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలతో పాటు బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌నాయక్, కొట్రేష్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు.

గేట్ ఏర్పాటుకు భూమి పూజ

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి జెడ్పీ హై స్కూలు ప్రహరీ గేటు ఏర్పాటు కోసం సర్పంచు మోదుపల్లి రామాంజనేయులు మంగళవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ‘నాడు–నేడు’ నిధులతో పాఠశాలకు ప్రహరీ, గేట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాలేనాయక్, వార్డు మెంబర్ మోదుపల్లి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

కళ్యాణదుర్గం: ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ సూచించారు. స్థానిక కోర్టులో మంగళవారం ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పోలీసులు, న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను సత్వరమే పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులను పరిష్కరించేలా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాసులు, వివిధ మండలాల ఎస్‌ఐలు, న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, దేవేంద్ర, సుదర్శన్ పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలించాలి

ఉరవకొండ: లింగవివక్ష రూపుమాపడానికి యువత భాగస్వాములు కావాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అష్రాఫ్ ఆలీ పిలుపునిచ్చారు. మంగళవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లింగవివక్షత నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలను కూడా బాలురతో సమానంగా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్‌నాయక్, హెల్త్ ఎగ్జిక్యూటర్ షఫీ, భగవాన్‌దాస్, హిమబిందు, సుంకమ్మ, అధ్యాపకుడు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శంకర్

బొమ్మనహాళ్: గ్రామ సచివాలయంలో ఉద్యోగులంతా తమ విధులను సక్రమంగా నిర్వహించాలని , సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సచివాలయంలో అందించే సేవలపై వారికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారం ధరించడంతోపాటు సమయపాలన పాటించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలాబేగం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాల తనిఖీ

విడపనకల్లు: మండలంలోని మాళాపురంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు చెప్తున్నారా అని విద్యార్థినులను ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదువు కోవాలని, మీ భవిష్యత్‌కు బంగారుబాట వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. అనంతరం నిత్యావసర సరుకులకు సంబంధించిన స్టోర్ రూంను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అలాగే ‘నాడు–నేడు’ పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం భీంరెడ్డి, మేకల రామాంజనేయులు ,పేరెంట్స్ కమిటీ చైర్మన్ సింగాడి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రాయదుర్గంలో భాగస్వాములు కావాలి



కార్మికులకు పనిముట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: ప్రజలందరూ స్వచ్ఛ రాయదుర్గం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై, కాల్వల్లో పారవేయకుండా కార్మికులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలిబాషా, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, శ్రీరామిరెడ్డి, మేస్త్రీలు భైరప్ప, గోవిందరాజులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మాజీ ఎమ్మెల్యే విశ్వ



శ్రీవారి ఆలయం వెలుపల మాజీ ఎమ్మెల్యే విశ్వ కుటుంబ సభ్యులు

ఉరవకొండ: తిరుమల వేంకటేశ్వరస్వామిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు ప్రణయ్‌రెడ్డి, కుటుంబసభ్యులు మంగళవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దంపతులను వేద పండితులు పట్టువస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

‘ఆర్‌వైఎస్‌ఎల్’ క్రీడాకారులకు వరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సాహించేలా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్(ఆర్‌వైఎస్‌ఎల్) నిర్వహించడం క్రీడాకారులకు వరమని ఎస్‌ఐ సుమన్ అన్నారు. సంక్రాంతి క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్‌తో కలసి ఎస్‌ఐ పోటీలను ప్రారంభించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కాగా కబడ్డీ, వాలీబాల్ పోటీలకు 44 జట్లు చొప్పున హాజరు కానున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఫకృద్దీన్, వార్డు ఇన్‌చార్జ్ గోరంట్ల సత్యనారాయణ, ఆర్గనైజర్లు శ్రీనివాసులు, చంద్రశేఖర్, శివరాజ్, ఓబ, మురళి, అమ్రరేష్, పీడీలు రామాంజనేయులు, ఖాజాహుస్సేన్, మల్లికార్జున, భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులుంటే సరిదిద్దుకోండి

కూడేరు: మండలంలో రీసర్వే జరిగేలోపు భూ, స్థలాలకు సంబంధించి పేర్లు, సర్వే నంబర్లు తప్పులున్నా, యజమానులు మృతి చెంది ఉన్నా పేర్లు మార్పు చేసుకోవాలని మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ రఘునాథ్ మంగళవారం తెలిపారు. నెల రోజుల్లో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద గ్రామ కంఠంలో పంచాయతీ శాఖ, భూములను రెవెన్యూ అధికారులు రీసర్వే చేస్తారన్నారు. అంతలోపు మార్పులు, చేర్పులు, తప్పులు సర్దుబాటు చేసుకోవాలన్నారు.

మరమ్మతుల పరిశీలన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు గద్వాల్ యల్లమ్మ ఆలయం వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పరిశీలించారు. సోమవారం సాయంత్రం పైప్‌లైన్ లీకేజీతో పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లీకేజీ పనులను సకాలంలో పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందిని ఆమె ఆదేశించారు.

సచివాలయ సిబ్బందిపై చర్యలు

కూడేరు: మండలంలోని కొర్రకోడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్‌పై జిల్లా కలెక్టర్ సెన్సూర్ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. అతనిపై అవినీతి, విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో ఏడాది పాటు అతడికి పదోన్నతి, ఇంక్రిమెంట్లు(సెన్సూర్) లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే కూడేరు సచివాలయం–1లో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ చరణ్ గత ఏడాది జూన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విధులకు గైర్హాజరయ్యారు. డీపీఓ షోకాజ్ నోటీస్ ఇచ్చినా సరైన సమాధానం లేకపోవడంతో ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యక్తిగత కారణాలతో విధులకు గైర్హాజరైనట్లు విన్నవించుకోవడంతో ఈ నెల 12న అతడిపై డీఎల్‌డీఓ విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

అదనపు పని దినాలు కల్పించండి

కళ్యాణదుర్గం రూరల్ : ఉపాధి పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కూలీలకు అదనపు పని దినాలు కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. ఆ పార్టీ రూరల్ మండల కార్యదర్శి ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి ఓంకార్ , తదితరులు మంగళవారం స్థానిక పీడీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

మౌలిక వసతులు కల్పించండి

కళ్యాణదుర్గం రూరల్: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఈసీసీ విస్తరణ అధికారి నీహారిక సూచించారు. ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా డీఎల్‌డీఓ శంకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, సంపూర్ణ విద్య, అంగన్‌వాడీల బలోపేతంపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్యాస్ వినియోగదారుల భద్రతే లక్ష్యం

రాయదుర్గంటౌన్: వినియోగదారుల భద్రత, మెరుగైన సేవలే లక్ష్యంగా ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు శ్రీదేవి ఎంటర్‌ప్రైజస్ మేనేజర్ కృష్ణ అన్నారు. జాతీయ ఇండియన్ ఆయిల్ డే సందర్భంగా పట్టణంలోని 2వ వార్డులో ప్రధాన పోస్టాఫీసు వద్ద ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో గ్యాస్ వినియోగం, ప్రమాదాల నివారణ అంశాలపై సేఫ్టీ క్లినిక్ నిర్వహించారు. ఇండేన్ గ్యాస్ మెకానిక్ ప్రసాద్ మహిళలకు గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు.

మండల వ్యవసాయాధికారిగా జాఫర్

కంబదూరు: మండల నూతన వ్యవసాయాధికారిగా జాఫర్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఏఓ మహేష్ కర్నూలుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా నుంచి జాఫర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. మంగళవారం ఆయన బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బంది ఏఓకు పూలమాలలతో స్వాగతం పలికారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఏఓ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బొమ్మనహాళ్/శెట్టూరు/విడపనకల్లు: తమకు ఉద్యోగ భద్రత కల్పించి రూ. 26 వేల జీతం ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు బొమ్మనహాల్, శెట్టూరు, విడపనకల్లులో వారు యూనియన్ నాయకులతో కలసి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్లకు అంగన్‌వాడీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు.

15లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలి

కూడేరు/వజ్రకరూరు: పీఎం కిసాన్ లబ్ధిదారులు జనవరి 15లోపు తప్పనిసరిగా ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. కూడేరు మండలంలో ఈ–కేవైసీ చేయించుకోని రైతులు 2,377 మంది ఉన్నారని ఏఓ నవత తెలిపారు. జనవరి 15లోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వజ్రకరూరు ఏఓ మధుకర్ సూచించారు. అలాగే ఫిబ్రవరి 15లోపు రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ‘ పీఎం కిసాన్.ఈకేవైసీ ఇన్’ అనే లింక్ , మీసేవ సెంటర్లు, వలంటీర్లు, వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

రాయదుర్గంటౌన్: స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయంలో పట్టణశాఖ ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ నాగమణి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు రామాంజనేయులు, రామకృష్ణ, మల్లికార్జున అనిల్, ఖాసీం, దాసు, విశ్వనాథ్, అన్సర్, అబుబక్కర్, నాగరాజు, రామలింగం, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.